ప్రజాశక్తి
ఆదివారం 12 జనవరి 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

జూద క్రీడలు వద్దు..

- కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు
- ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, శివార్లు మరియు ఇతర ప్రాంతాల్లో కోడి పందేలు,పేకాట వంటి జూదాలు నిర్వహించడం నిషేధమని, ఎవరైనా కోడి పందేలు, జూదాలు ఆడినా, ప్రోత్సహించినా మరియు సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సాంప్రదాయం క్రీడలు అయిన కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్ బాల్, క్రికెట్ మొదలగు క్రీడలు నిర్వహించుకోవాలని, పండగలను కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.

జిల్లాలో కోడిపందేలు, జూదాలు తదితర అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోలీసు అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని, కోడిపందేలు, పేకాట స్థావరాలను గుర్తించి నిఘా పెట్టాలన్నారు. గతంలో కోడి పందేలు, జూదాలు పట్టుబడిన వ్యక్తులను బైండోవర్ చేయాలన్నారు. కోడి పందేలకు కత్తులను తయారు చేసే వారిని, ఆ కత్తులను సరఫరా చేసే వారిని, పందేలు నిర్వహించేందుకు స్థలాలను కేటాయించే వారిని గుర్తించి మంచి ప్రవర్తన కోసం బైండోవరు చేయాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగలో ప్రజలకు 'జూద క్రీడలు వద్దు-సాంప్రదాయక క్రీడలు ముద్దు' అనే నినాదంతో గ్రామగ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడి పందెం, జూదం మరియు ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లుగా తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ - 112/100 కు లేదా పోలీసు వాట్సాప్ నంబరు 9121102266 కు సమాచారాన్ని అందించాలని సూచించారు.

పోలీసు హెచ్చరిక..లెక్క చేయక..!

'దమ్ముంటే పట్టుకో శిఖావత్తు.. పట్టుకుంటే వదిలేస్తా సిండికేటు..' ఇది ఇటీవల వచ్చిన ఓ సినిమాలో స్మగ్లర్ అయిన హీరో పోలీసు ఆఫీసర్‌కు సవాల్ విసిరే డైలాగ్. ప్రస్తుతం నిజజీవితంలోనూ బాపట్ల జిల్లాలో కోడిపందెం జూదరులు కూడా ఇదే వ్యవహారశైలితో ఉన్నారు. జిల్లా ఎస్పీ నుంచి ఎస్ఐ దాకా కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నా.. జూదరులు అస్సలు లెక్కచేయడం లేదు. అధికారపార్టీ నేతల అండదండలతో జిల్లాలోని రేపల్లె నియోజకవర్గంలో అతి పెద్ద కోడిపందేల బరిని సిద్ధం చేశారు. గత రెండు వారాలుగా ఇందుకోసం చేసిన ఏర్పాట్లు శనివారం నాటికి పూర్తి అయ్యాయి. జిల్లాలో రేపల్లెతో పాటు వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో కూడా కోడిపందేలకు బరులు సిద్ధమయ్యాయి.

రేపల్లె నియోజకవర్గం, తూర్పుపాలెం వద్ద కోడిపందేలకు సిద్ధమయిన బరులు

- బాపట్ల జిల్లాలో కోడిపందేలకు సర్వం సిద్ధం
- అధికారం అండగా పందెం బరులు సిద్ధం చేసిన జూదరులు
- రేపల్లె నియోజకవర్గంలో అతి పెద్ద పందెం బరులు
- విఐపిల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆహ్వానాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు అనుసరిస్తూ వచ్చిన విధానాలను తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తూ ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తెలుగు తమ్ముళ్లు సంక్రాంతి సంబరాల పేరుతో చట్ట విరుద్ధమైన పనులకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇసుక అక్రమ రవాణా, రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం, మద్యం సిడికేట్ వ్యవహారాల్లో తలదూర్చి తమకు ఆదాయం వచ్చే అన్ని అక్రమ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్న తెలుగు తమ్ముళ్లు అధికారం అండగా భారీ ఎత్తున కోడి పందేల బరులను సిద్ధం చేశారు. రైతుల నుంచి తాత్కాలిక పద్ధతిపై భూములను లీజుకు తీసుకొని కోడిపందేల కోసం బరులను సిద్ధం చేశారు. జిల్లాలోని రేపల్లె నియోజకవర్గంలో అతి పెద్ద కోడిపందేల బరిని ఏర్పాటుచేశారు. గత రెండు వారాలుగా ఇందుకోసం చేసిన ఏర్పాట్లు శనివారం నాటికి పూర్తయ్యాయి. జిల్లాలో రేపల్లెతో పాటు వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో కూడా కోడిపందేలకు బరులు సిద్ధమయ్యాయి. మిగతా చోట్ల కూడా పందేలు జరగనున్నాయి.

వేమూరు నియోజకవర్గం, కొల్లూరు మండలం క్రాప అడ్డరోడ్డు సమీపంలో, జంపని చక్కెర ఫ్యాక్టరీ, చిలుమూరు, భట్టిప్రోలు మండలం ▶ 2లో

విద్యుత్ బిల్లులను
భోగి మంటల్లో వేయండి

సిపిఎం జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

విద్యుత్ ఛార్జీలు పెంచమంటూనే సర్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై విపరీతమైన భారాలు మోపిన ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఈ నెల 13న భోగి మంటల్లో బిల్లులను దగ్ధం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. శనివారం నాడు సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశం నిర్ణయాలను సిపిఎం జిల్లా కార్యదర్శి యస్.కె.మాబు మీడియాకు వెల్లడించారు. గత ప్రభుత్వం ప్రజల మీద విద్యుత్ ఛార్జీల పెంచినప్పుడు అప్పటి ప్రతిపక్ష పార్టీ 'బాదుడే బాదుడు' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాక తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. అధికారం చేపట్టిన తరువాత హామీలు విస్మరించిందని విమర్శించారు. ఇష్టారీతిన ట్రూఅప్ వంటి పలు రూపాల్లో ప్రజల మీద విద్యుత్ భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఛార్జీల పెంపుదల గత ప్రభుత్వం నిర్ణయాలే కారణమనడం ప్రజల్ని మభ్యపెట్టే చర్య అని ఆరోపించారు. గత ప్రభుత్వం అనుసరించిన తప్పులు సరి చేసి ప్రజలకు మేలు చేయాల్సిన ప్రభుత్వం వాటినే అమలు చేస్తూ కుంటి సాకులు చెప్పటం సిగ్గుచేటన్నారు. ఎప్పుడో వాడుకున్న విద్యుత్తుకు ఇప్పుడు ఛార్జీలు చెల్లించడం అనే ఈ సంస్కరణల పద్ధతిని సిపిఎం గత ప్రభుత్వ కాలంలోనూ నేడు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ సంస్కరణల పద్ధతిలో విద్యుత్ వాడుకొన్న ఛార్జీల కంటే అదనపు ఛార్జీలే అధికంగా ఉంటాయని, ఇది ప్రజలను దోచేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యగా పేర్కొన్నారు. జిల్లా ప్రజల మీద 78 కోట్ల విద్యుత్ ఛార్జీల అదనపు భారం మోపటం అన్యాయమని అన్నారు. ఈ విద్యుత్ ఛార్జీల భారాలను నిరసిస్తూ ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా భోగి మంటల్లో విద్యుత్ చార్జీల బిల్లులను దగ్ధం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నష్ట పరిహారం చెల్లించాలి..

ఇటీవల కురిసిన అధిక వర్షాలకు జిల్లాలో 25 వేల హెక్టార్లలో మినుము, కంది లాంటి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. వరి, మిర్చి వంటి పంటలకు కూడా నష్టం నష్టం వాటిల్లినట్లు చెప్పారు. నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేసే కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరల చట్టం ప్రకారం క్వింటాలు 1750 రూపాయలకు కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలను కదిలించి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. తొలుత ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్, జివి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, డి.సోమయ్య, ఎం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అద్దంకి మండలం, గోవాడలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

గోకులాలతో
పాడి పరిశ్రమకు మరింత ప్రోత్సాహం ▲ 8లో

వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

పోరాట యోధుడు 'వడ్డే ఓబన్న' ▲ 8లో

పోలీసు హెచ్చరిక..లెక్క చేయక.!

(మొదటిపేజీ తరువాయి)

పల్లెకోన, బాపట్ల నియోజకవర్గంలోని పిట్లవానిపాలెం మండలం మంతెనవారిపాలెం వద్ద బరులు ఏర్పాటు చేశారు. రేపల్లె నియోజకవర్గంలో చెరుకుపల్లి, నగరంల మధ్య ఉన్న రహదారి పక్కన తూర్పుపాలెం పంచాయతీ పరిధిలో దాదాపు 35 ఎకరాల్లో నాలుగు కోడిపందేల బరులు సిద్ధం చేశారు. ఇందులో ఒకటి విఐపి బరిగా ఉంది. ఇందుకోసం అక్కడి భూమిని చదును చేయడం, పెద్దపెద్ద హద్దు రాళ్లతో ఐరన్ ఫెన్సింగ్ వేశారు. కోడి పందేలు జరిగే సమయంలో ఆ ప్రదేశంలోకి అనుమతి లేనిదే ఎవరూ రాకుండా కట్టుదిట్టమయిన ఏర్పాట్లు చేశారు. బరుల చుట్టూ ఫెన్సింగ్ వేశారు. విఐపి బరిలో పెద్దల కోసం పెద్ద గుడారం వేయడంతో పాటు, వారు పందేలు చూసేందుకు వీలుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఆ ప్రదేశం చుట్టూ.. రహదారిపైన మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టారు. ఆదివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోడిపందేల బరుల వద్ద ముగ్గుల పోటీలు, సాంప్రదాయ పోటీలు పెట్టనున్నారు. వీటిని ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారు. ఈ తరువాత మూడు రోజుల పాటు పగలు, రాత్రి కోడిపందేల కోసం ఏర్పాట్లు చేశారు. భారీగా ఫ్లడ్‌లైట్లు పెట్టారు.

జిల్లాలో చాలా చోట్ల పొలాల్లో, తోటల్లో తరచుగా కోడిపందేలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సంక్రాంతికి కోడిపందేల బరుల ఏర్పాట్ల కోసం ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చు పెట్టిన నిర్వాహకులు పందెం జూదరులను రప్పించేందుకు వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. బరుల వద్ద మద్యం విక్రయాలు, పలు రకాల జూదాలు, బిర్యానీ, ఇతర తినుబండారాల అమ్మకాలకు స్టాల్స్ ఏర్పాటు చేస్తూ వేలం తరహాలో అనుమతులిచ్చారు.

పోలీస్ అధికారుల మౌనం

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు చేస్తున్నా.. మరో వైపు బహిరంగంగా బరులు సిద్ధమవుతున్నాయి. అధికారం అండగా జరగనున్న సంక్రాంతి కోడి పందేలను నిలువరించడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం మౌనమే వహిస్తోంది. రహదారుల పక్కనే భారీ ఎత్తున కోడి పందేల కోసం బరులు సిద్ధమవుతున్నా తమకు సంబంధించిన అంశం కానట్లుగా ఉండిపోయారు. సంక్రాంతి సంబరాల పేరుతో కోడిపందేలు జరగకుండా చూడాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కోర్టు కొద్ది రోజుల క్రితం మధ్యంతర ఉత్తర్వులివ్వడం జరిగింది. కోడిపందేలు, జూదం, అక్రమ మద్యం విక్రయాలను నిలువరించాలంటూ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు అడ్డుకోవాలని గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలుకావడం లేదని వాటిని అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆ వ్యాజ్యంలో పేర్కొన్నారు.

ఈ మేరకు గతంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కానీ భారీ బరుల్లో జరుగనున్న కోడి పందాలను పోలీసులు అడ్డుకునే పరిస్థితి లేకపోయినా, గ్రామాల్లో అక్కడడక్కడా జరుగుతున్న కోడిపందేలను మాత్రం పోలీసులు నిలువరించగలుగుతున్నారు. వారికి రాజకీయ అండదండలు లేవు కనుక కేసులు పెట్టగలుగుతున్నారు.

13 నుంచి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరులో ఈ నెల 13వ తేదీ నుంచి సంక్రాంతి సంబరాలు జరుగుతాయని టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంతి బాబు తెలిపారు. 13వ తేదీ భోగి రోజు పెద్ద మసీదు సెంటర్‌లో భోగి మంట, ముగ్గుల పోటీలు, స్లో సైక్లింగ్, డాన్స్ బేబి డాన్స్, మహిళలకు మెహిందీ (గోరింటాకు) కార్యక్రమం నిర్వహిస్తారు. 14, 15 తేదీల్లో వివిధ పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బెజవాడ వెంకటేశ్వర్లు, టిడిపి అధ్యక్షులు కామని విజయకుమార్, కామని వెంకటరావు, దామచర్ల శ్రీధర్‌బాబు, మక్కెన కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

వడ్డే ఓబన్నకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా రాచర్ల మండలము గౌతవరం గ్రామంలో వడ్డే ఓబన్న చిత్ర పటానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేఖంగా మొదటిసారి తిరుగుబాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాటంలో జీవితాంతం నరసింహారెడ్డి వెంట నిలిచిన సహచర,సేనాపతి వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆనాడు బ్రిటిష్ పాలనలో భరణాలు ఎగ్గొట్టడంలో గాని, రైతుల పై అధిక పన్నులు విధించడంలో కానీ బలవంతంగా వసూలు చేస్తున్న శిస్తులకు వ్యతిరేకంగా 1845లో సైరాతో మొదలైన ఉద్యమంలో ఓబన్న సైన్యాధికారిగా పనిచేశారు. గిద్దలూరు గ్రామ సమీపంలో జగన్నాథ కొండ వద్ద నర్సింహారెడ్డి, ఓబన్న తమ బలగాలతో ఉన్నట్టు ఒక దేశద్రోహి ఇచ్చిన సమాచారంతో బ్రిటీష్ బలగాలతో జరిగిన భీకర పోరాటంలో ఓబన్న తన 39వ యేట వీరమరణం పొందారని ఇలాంటి స్వాతంత్ర సమరయోధుడికి నివాళులు అర్పించి స్మరించుకోవటం మనందరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, పార్లమెంటు నాయకులు గోపిరెడ్డి జీవన్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేర స్థానిక మార్కాపురం మున్సిపాలిటీ వద్ద పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి రూబెన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 నగరపాలక సంస్థలు పురపాలక సంఘాలు నగర పంచాయతీలలో ఇంజనీరింగ్ విభాగాలైన మంచినీటి నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, టౌన్ ప్లానింగ్ నిర్వహణ ట్విట్టర్స్ మెకానిక్స్ కంప్యూటర్ ఆపరేటర్లు ఆఫీస్ నిర్వహణ బిల్ కలెక్టర్ సూపర్వైజర్స్, వాచ్మెన్ తదితర విభాగాలకు చెందిన సుమారు 13,000 మంది కార్మికులు 25 ఏళ్ల నుంచి ప్రజలకు ప్రభుత్వం తరపున సేవలందిస్తున్నారని, వీరికి 2018 సంవత్సరం వరకు పారిశుధ్య కార్మికులతో పాటు సమానంగా జీతాలు చెల్లించాలని కోరారు. ప్రస్తుతం పారిశుధ్య కార్మికుల కంటే తక్కువ వేతనాలు చెల్లించడం సరైనది కాదని అన్నారు. నిత్యం ప్రమాదకర పరిస్థితులలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలని, అవసరమైన పనిముట్లు, కిట్లు, యూనిఫాం అందించాలని, అదనపు పనులు కేటాయించినప్పుడు టీఏ డీఏలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొట్టం హరికృష్ణ, ఆరేపల్లి వెంకటరమణ, జి అల్లూరయ్య, ఈ కనకయ్య, సాయిరెడ్డి, బేగు, టి శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

కిరణ్ మృతి పార్టీకి తీరని లోటు: మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

మంత్రి స్వామి సంతాపం

జరుగుమల్లి మండలంలోని కె బిట్రగుంట గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియరు నాయకులు యర్రా కిరణ్ చౌదరి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం కిరణ్ అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి యర్రా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కిరణ్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ కిరణ్ కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె బిట్రగుంట తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వి అజయ్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో కోడి పందాలు, పేకాటలు నిర్వహిస్తే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పలువురిని హెచ్చరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ అజయ్‌బాబు తెలిపారు. కోడిపందేల సమయంలో కోడి కాళ్లకు వినియోగించే కత్తులను సప్లై చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. గతంలో కోడిపందాలు నిర్వహించిన వారిని పిలిపించి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. మండల ప్రజలకు ఈ సందర్భంగా భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికే గోకులం షెడ్లు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

రాష్ట్రప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పాడిపరిశ్రమను అభివృద్ధి చేసేందుకు గోకులం షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని డ్వామా పిడి జోసఫ్ కుమార్ అన్నారు శనివారం మండలంలోని నిడమానూరు పంచాయతీ పరిధిలోని హనుమాపురంలో నిర్మించిన గోకులం షెడ్డును జోసఫ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడిపరిశ్రమపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో పాడిపరిశ్రమను మరింత అభివృద్ధి పరిచి ఆర్థిక పరిపుష్టి చెందేవిధంగా రాష్ట్రప్రభుత్వం గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో 68 షెడ్లు మంజూరు అయ్యాయన్నారు. వాటిని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగిలిన వారు వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ మరియు ఎంపిడిఓ వై మహాలక్ష్మి, నాగులుప్పలపాడు పశుసంవర్థకశాఖ ఏడి నాగభూషణం, డుమా ఏపిడి వెంకటస్వామి, ఏపిఓ రవిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

It is informed to the general public that my client **Smt. SRI SRI SRI VENKATESWARA EDUCATIONAL SOCIETY, PEDDANNAPALEM,** Secretary & Correspondent Mallela Rami Reddy, S/o. Rama Subba Reddy informed that he had misplaced Original Regd. **Sale Deed Doc. No.5746/2017,** dated : **21-09-2017** at SRO, Darsi executed by Mogili Srinu in favour of **SRI SRI SRI VENKATESWARA EDUCATIONAL SOCIETY, PEDDANNAPALEM,** Secretary & Correspondent Sri Mallela Rami Reddy pertaining to the below mentioned Schedule of Property. If anybody found the above Documents same may be intimated / hand over the same to the below mentioned office. My Client further states that she wants to avail loan by mortgaging the schedule mentioned property. If any person has any claim/interest/dispute over the said transaction, the same may be intimated to the undersigned within 7 (seven) days from the date of this publication, failing which, no further claims/objections will be entertained and my client will proceed with the same.

SCHEDULE OF PROPERTY

All that part and parcel of Open Place in **Sy. No.67/2, to an extent of Ac.0.29 cents, Sy.No.67/3, to an extent of Ac.0.41 cents, Sy.No.67/4, to an extent of Ac.0.30 cents** totaling land consisting of above three survey numbers **Ac.1.00 cents, or 0.405 Hectors** Near Viswa Bharathi Vidyalayam, situated at Peddannapalem Village, Donakonda Mandal District, Prakasam, A.P within Markapuram District Registry, in Darsi Sub-Registry and **bounded by: East:** Land belongs to vendor, **West:** Land belongs to Tommandru Subrahmanyam, **North:** Land belongs to Mindala Srinu, **South:** Land belongs to Kuravadi Chennayya.

Date: 11.01.2025
Place: Ongole

P. Santosh Kumar,
Advocate, #1-8-506/2/A/1,
Adnan Chambers,
Prakashnagar, Begumpet,
Secunderabad- 500016.
Cell: 09440067560

బహిరంగ ప్రకటన

ఒంగోలు పట్టణ కాపురస్తుడు లేట్ ఆలూరి వీరభద్రాచారి కుమారుడు రామ బ్రహ్మాచారి నాకు ఇచ్చిన సంజాయిషి మేరకు ఈ క్రింది నోటీసు ఇవ్వడమైనది నా క్లయింట్ పేరున 18.04.1994 సంవత్సరమున ఒంగోలు పట్టణ కాపురస్తురాలు కల్లూరి సాంబయ్య శ్రీనివాసరావు మరియు రమణమ్మ అనువారులు ఒంగోలు సబ్ రిజిస్టర్ ఆఫీస్ నందు రిజిస్టర్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెంబర్ 257/1994న షెడ్యూలు దాఖల ఒకటో నెంబర్ ఐటెమ్ వారి తరపున విక్రయించుటకు వ్రాయించి వున్నారు. మరియు 18.04.1994 సంవత్సరమున ఒంగోలు పట్టణ కాపురస్తులు తోట కోటేశ్వరరావు, పాండురంగారావు, నాగేశ్వరరావు, మరియు కోట లక్ష్మీనారాయణ అనువారులు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెంబర్ 259/1994 షెడ్యూలు రెండవ నెంబర్ ఐటెమ్ గురించి విక్రయించుటకు వ్రాయించి ఇచ్చి ఉన్నారు. అట్టి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజులు తేది 12.12.2024 సంవత్సరమున నా క్లయింట్ ఒంగోలు పట్టణము ఆర్టీసీ బస్టాండ్ లో సదరు దస్తావేజులు డిపో నందు పోయినవి పై తెలిపిన దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల వాటిని నా క్లయింట్ మొబైల్ నెంబర్ **9490215723** కు తెలియజేసీ చెందజెయవలెను

షెడ్యూలు

ఐటెమ్ నంబర్ 1: ప్రకాశం జిల్లా ఒంగోలు సబ్ రిజిస్ట్రీ అన్నవరప్పాడు గ్రామం సర్వేనెంబర్ 111/2 విస్తీర్ణంయ 1-30 సెంట్లు

ఐటెమ్ నెంబర్ 2: ప్రకాశం జిల్లా ఒంగోలు సబ్ రిజిస్ట్రీ అన్నవరపాడు సర్వేనెంబర్108/2 లో విస్తీర్ణం 1-50 సెంట్లు

ఇట్లు
మేకల రామమూర్తి
అడ్వకేట్
హై కోర్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్
చాంబర్ నెంబర్.5 ఒంగోలు
సెల్ **9866911718**

ఒంగోలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No. 12/2023

షేక్ ఫయాజ్ బాషా ...వాది

మరియు

షేక్ కుర్షీద్ మహమ్మద్ ...ప్రతివాది

ప్రకటన

To,

ప్రతివాది: షేక్ కుర్షీద్ మహమ్మద్, S/o. షేక్ ఖుద్దూష్, R/o. D.No. 24-10-5, న్యూషరీఫ్ బజార్, శంకర్ మఠం, రింగురోడ్ ప్రక్కన, పొన్నూరు టౌన్, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ ముట్టనందున మీ నోటీసు నిమిత్తము కోర్టు వారు తేది: 06-02-2025న వాయిదా వేశినారు. తేది: 06-02-2025న ఉదయం గం॥ 10.30 ని.లకు మీరు స్వయంగా గానీ, లాయరు గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరుపడి మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. లేని యడల మీ పరోక్షమున కేసు తీర్మానం చేయబడునని తెలియచేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో //

వాయిదా తేది: 06-02-2025

ఇట్లు
యం. గంగాధరరావు,
B.A., B.L.,
కె. శివప్రసాదరావు,
B.Sc, B.L.,
వాది తరపు అడ్వకేట్స్, ఒంగోలు
ఒంగోలు
తేది: **2-1-2025**
సెల్: **9866729690**

NOTICE
IN THE COURT OF THE II ADDL. JUDICIAL FIRST CLASS MAGISTRATE: ONGOLE. A.P. PIN: 523001
C.C. No.630/2019

Sai Vigneswara Stone Crusher, represented by its Managing Partner, Bommisetty Ravikiran Kumar ...Complainant

Versus

Zion Stones, Represented by Proprietor, C.Samson ...Accused

PROCLAMATION REQUIRING APPEARANCE OF A PERSON ACCUSED

Whereas complaint has been made before me that **Zion Stones**, represented by its Proprietor, - **C.Samson**, Survey No.306, Plot No.499A, Growth Centre, Gundlapalli, Annangi Village, Maddipadu Mandal, Prakasam District, A.P. Cell No.9440242340, has committed the Offence of Cheque Dishonour Case punishable under Section 138 of N.I. Act, and it has been returned to a warrant of arrest thereupon issued that the said **C.Samson**, cannot be found, and whereas it has been shown to my satisfaction that the said **C.Samson**, has absconded or is concealing himself to avoid the service of the said warrant;

Proclamation is hereby made that the said **C.Samson**, Proprietor, Zion Stones, is required to appear at ONGOLE before this Court to answer the said complaint on the 13th day of February, 2025.

(By order of the Court)

Ongole,
Dt.11-01-2025.

Sd. N.S.SREENIVASULU,
Advocate,
9440517332.

51 మంది బైండోవర్

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 51 మందిని బైండోవర్ చేసినట్లు డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలను నివారించే దిశగా కఠిన చర్యలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు కోడిపందేలను నియంత్రించేందుకు రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని పేకాటరాయుళ్లు, కోడిపందెం కేసుల్లో ఉన్న పాత నిందితులను, కోడి కత్తులను తయారు చేసేవారు, కోడి కత్తులు కట్టేవారు కలిపి 51 మందిని బైండోవర్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న పోలీసులు

పోలీసు లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు

ప్రజాశక్తి - చీరాల

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఎస్ఐ సంపూర్ణరావు అంత్యక్రియలు శనివారం పేరాలలోని గాంధీ నగర్ సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో పోలీస్ లాంఛనాలతో నిర్వహించారు. సంపూర్ణ రావు మృతి పట్ల జిల్లా ఎస్పీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమర్థవంతంగా విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది దురదృష్టకర రీతిలో రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. చీరాల డీఎస్పీ మోయిన్, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఆర్.ఐలు, చీరాల 1వ, 2వ పట్టణ, రూరల్ సిఐలు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేల నగదును ఆయన సతీమణికి అందజేశారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన దొనకొండ ఎస్ఐ విజయ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు మహాప్రస్థానం ప్రారంభం

ప్రజాశక్తి-పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరులో ఒక కోటి ఇరవై అయిదు లక్షల రూపాయలతో అభివృద్ధి చేసిన మహాప్రస్థానంను ఆదివారం ఉదయం 9 గంటలకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించనున్నారు. ఆదివారం ఈ సందర్భంగా చెరువు కట్టపై విందు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తిరగబడిన ట్రాక్టర్

నుజ్జునుజ్జయిన కారు

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ఒకరు మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు

మృతి చెందిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డు సమీపంలో అద్దంకి-నార్కెట్ పల్లి రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందిన వివరాల ప్రకారం కొరిశపాడు మండలం, రావినూతల గ్రామానికి చెందిన కారుసాల శ్రీనివాసరావు (58) మరో నలుగురు సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాదు నుంచి శనివారం స్వగ్రామం రావినూతలకు కారులో బయలుదేరారు. కారు అద్దంకి-నార్కెట్ పల్లి రహదారిపై వస్తూ, పుట్టావారిపాలెం అడ్డరోడ్ జంక్షన్‌కు సమీపంలోకి రాగానే ముందు వెలుతున్న ట్రాక్టర్‌ను కారు ఢీకొంది. దీంతో ట్రాక్టర్ రహదారిపైనే తిరగబడింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. దీంతో కారు డ్రైవర్ పరారీ అయ్యాడు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ వాహనంలో నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రావినూతల గ్రామానికి చెందిన కారుసాల శ్రీనివాసరావు మృతి చెందాడు. మిగిలిన నలుగురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ట్రాక్టర్ పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం ప్రాంతంలో మాగాని పొలాలలో దమ్ము చేసి తిరిగి తమ స్వగ్రామమైన కావలి వైపు వెలుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సంఘటన స్థలానికి ఎస్ఐ పట్టాభి రామయ్య చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంత్రి గొట్టిపాటి నివాళి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వజ్జ సుబ్బయ్యకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఘనంగా నివాళులర్పించారు. సుబ్బయ్య శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. అలవలపాడు గ్రామానికి చెందిన గొట్టిపాటి కోటేశ్వరరావు ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి మంత్రి రవికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామానికి చెందిన నాదెండ్ల శ్రీమన్నారాయణ దశదినకర్మలో మంత్రి గొట్టిపాటి పాల్గొని నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ కరి వెంకట సుబ్బారావు, చింతల సహదేవుడు, కుక్కపల్లి ఏడుకొండలు, రావూరి రమేష్ బాబు, అల్లమనేని బ్రహ్మానంద స్వామి, గొట్టిపాటి కాజా స్వామి, జాగర్లమూడి భాను ప్రకాష్, గుర్రం ఆదిశేకర్, మస్తాన్వలి, కోమటి ప్రసాద్, మస్తాన్వలి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన అవుట్ పోస్ట్, మెరైన్ పోలీసులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సూర్యలంక సముద్రపు తీరంలో ఆత్మహత్యకు యత్నించిన మహిళను గస్తీ విధులలో ఉన్న అవుట్ పోస్ట్, మెరైన్ పోలీసు సిబ్బంది రక్షించారు. బాపట్ల పట్టణానికి చెందిన 26 ఏళ్ల మహిళ శనివారం ఆత్మహత్య చేసుకునేందుకు బీచ్‌కు వచ్చింది. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి ఆమె ప్రాణాలను కాపాడారు. అనంతరం ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు. అవుట్ పోస్ట్, మెరైన్ పోలీసులకు, జిల్లా ఎస్పీకి బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించాలి

ప్రజాశక్తి-బాపట్ల

గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలని బాపట్ల జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివనారాయణ అన్నారు. శనివారం నెహ్రూ యువ కేంద్రం గుంటూరు సౌజన్యంతో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ కన్వీనర్ ఎన్.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కొండుబోట్లవారిపాలెంలో నిర్వహించిన క్లస్టర్ గేమ్ క్రీడల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో చివుకుల సాంబయ్య, ఉలిచి వెంకయ్య, శ్రీనివాసరావు, కాసాని బుల్లి, రాంబాబు, డి.శివన్నారాయణ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-బాపట్ల

ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సాయి (24) శనివారం ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే యువకుడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

నాటు సారా డ్రమ్ములతో ఎక్సైజ్ అధికారులు

నాటుసారా బట్టీలు ధ్వంసం

ప్రజాశక్తి-నిజాంపట్నం

నిజాంపట్నం మండలంలోని దిండి సమీపంలోని మడ అడవిలో నాటు సారా బట్టీలను ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిఐ మార్తుర్ శ్రీరామ్ ప్రసాద్ శనివారం ధ్వంసం చేశారు. అదవల, పరిశవారిపాలెం, యేమినేనివారిపాలెం పరిసర ప్రాంతాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. మూడు ప్రాంతాలలో నాటు సారా తయారీ కోసం దాచి ఉంచిన మొత్తం 700 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

పాలు కల్తీ చేస్తే కఠిన చర్యలు

పాలకేంద్రాల్లో పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి-ముండ్లమూరు

పాలను కల్తీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌లో గ్రామాలలో పాలు సేకరించే వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలోని దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు, దొనకొండ మండలాల్లో పాలల్లో కల్తీ జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. చంద్రగిరి దగ్గర ఉన్న శరణ్య పాల కేంద్రం వద్ద తొమ్మిది క్యానులు ఆయిల్, 350 లీటర్ల పాలను సీజ్ చేశారు. ఈ ఆయిల్ ల్యాబ్‌కి పంపి పరిశీలిస్తామని తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఆంధ్రరత్న రైస్ అండ్ ఫ్లోర్ మిల్ వద్ద పిడిఎస్ బియ్యం అమ్ముతున్నారన్న సమాచారంతో సిఐ మల్లికార్జున రావు ఆధ్వర్యంలో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది దాడి చేశారు. రేషన్ బియ్యం అమ్ముతున్న రైస్ మిల్ ఓనర్ శ్రీకాకుళం రామకృష్ణ, గుంటూరు పెదపలకలూరుకు చెందిన కస్తూరి సాయి దిలీప్, సింగరాయకొండకు చెందిన లారీ డ్రైవర్ దాసరి బ్రహ్మయ్యలను అదుపులోకి తీసుకున్నారు. లారీలో ఉన్న 16 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వీరిపై కేసు నమోదు చేశామన్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు సిఐ మల్లికార్జున రావు తెలిపారు.

కోడి పందేలకు బరులు సిద్ధం

ఏర్పాట్లలో నిమగ్నమయిన నిర్వాహకులు

రూ.కోట్లలో చేతులు మారే అవకాశం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

సంక్రాంతి సంబరాల పేరుతో పలుచోట్ల కోడిపందాల బరులను నిర్వాహకులు సిద్ధం చేశారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్న ఈ కోడిపందాల బరులు మూడు రోజులపాటు కొనసాగే అవకాశం ఉంది. ముఖ్యంగా కొల్లూరు మండలం అడ్డరోడ్డు వద్ద, అనంతవరం గ్రామంలో, వేమూరు మండలంలోని జంపని చక్కెర కర్మాగారం సమీపంలో, చుండూరు మండలంలోని ఎడ్లపాడు వద్ద భారీ స్థాయిలో కోడిపందాల నిర్వహణకు సిద్ధం చేశారు. గత వారం రోజుల నుంచి నిర్వాహకులు కోడిపందాల బరుల కోసం పంట భూములను అద్దెకి తీసుకొని చదును చేసి అవసరమైన భారీ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 13, 14, 15 తేదీలలో కొనసాగే ఈ కోడిపందాల ద్వారా కోట్లది రూపాయలు చేతులు మారే అవకాశం ఉంది. పందేలు తిలకించటానికి ఎమ్మెల్యే స్థాయి నుంచి మంత్రులు కూడా పాల్గొనే అవకాశం ఉన్న దృష్ట్యా వారికి ప్రత్యేక ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా

జంపనిలో కోడిపందేల బరికి స్వాగత ద్వారం

కోడిపందేల బరుల వద్ద పందేలతో పాటు వివిధ రకాల జూదాలు కూడా కొనసాగనున్నాయి. ఈ ప్రాంతాలలో మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగటమే కాకుండా కాయ్ రాజా కాయ్, లోన-బయట, మూడు ముక్కలాట వంటి పేకాటలు కూడా నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. సోమవారం నుంచి బుధవారం వరకు కొనసాగే ఈ కోడిపందాల నిర్వహణ కొరకు ఆయా ప్రాంతాల అధికార

కొల్లూరులో సిద్ధం చేస్తున్న బరులు

పార్టీ నాయకులు దగ్గరుండి అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేయడం గమనార్హం. ఇలా ఉండగా అధికారికంగా కోడిపందాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినప్పటికీ ఉన్నతస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో జరిగే ఆ ప్రాంతాల్లో ఈ మూడు రోజులపాటు పోలీసులు కూడా కనిపించే పరిస్థితి లేదు.

ఫుట్‌బాల్ ఆడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరచాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. పేరాల స్పోర్ట్స్ అండ్ కల్చర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్, ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఏఆర్ఎంహెచ్ హైస్కూల్ మైదానంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, అభిమానులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

దిగువ భూములకు సాగు నీరివ్వండి

అధికారులతో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి - పంగులూరు

పమిడిపాడు మేజర్ పరిధిలోని పంటలకు తక్షణమే సాగు నీరు అందించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పంటలకు సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నామని, సాగర్ నీరు దిగువ ప్రాంతా భూములకు అందడం లేదని మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామ రైతులు శనివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు తెలిపారు. సాగునీటి సమస్యపై స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఎస్ఈతో ఫోన్లో మాట్లాడారు. దిగువ ప్రాంతా రైతులకు సాగునీరు అందక ఇబ్బంది పడుతుంటే, అధికార యంత్రాంగం ఏం చేస్తుందని ఆయన ప్రశ్నించారు. పమిడిపాడు మేజర్‌పై వెంటనే పర్యటించి తగు చర్యలు తీసుకోవాలని రవికుమార్ కోరారు. క్రింది స్థాయిలో అధికార యంత్రాంగాన్ని తక్షణమే సమావేశపరిచి, అప్రమత్తం చేయాలన్నారు. పమిడిపాడు మేజర్ పరిధిలోని తూర్పు కొప్పెరపాడు, తూర్పు తక్కెళ్ళపాడు, చందలూరు, నూజిలపల్లి గ్రామాల్లో సాగులో ఉన్న పంటలకు సాగునీరు అందేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట స్థానిక నేతలు మాజీ జడ్పీటీసీ కెవి సుబ్బారావు, చింతల సహదేవుడు, పూనాటి రామాంజనేయులు, ఎనికపాటి శ్రీనివాసరావు, గొట్టిపాటి కాజా స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మండలాధ్యక్షుల ఎంపిక

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గంలో వైసీపీ నూతన మండల అధ్యక్షులను ఎంపిక చేశారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు నూతన అధ్యక్షులను ఎంపిక చేశారు. వేమూరు మండల వైసిపి అధ్యక్షులుగా దాది సుబ్బారావు, కొల్లూరు మండల అధ్యక్షులుగా సుగ్గున మల్లేశ్వరరావు, భట్టిప్రోలు మండల అధ్యక్షుడిగా పడమటి శ్రీనివాసరావు (టోపీ శీను), అమృతలూరు మండల అధ్యక్షులుగా గడ్డిపాటి హేమచంద్ర శ్రీనివాస్, చుండూరు మండల అధ్యక్షులుగా రఘురామిరెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అశోక్ బాబుకు ఎంపికైన అధ్యక్షులు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే నూతన అధ్యక్షులకు ఆయా మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా..

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

ప్రజాశక్తి-ఇంకొల్లు

వైసిపి పాలనలో సంక్షోభంలోకి వెళ్లిన పాలనను ముఖ్య మంత్రి చంద్రబాబు ఆరు నెలల కాలంలోనే సంక్షేమం దిశగా పయనించేలా అద్భుత పాలన సాగించారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం ఇంకొల్లు పట్టణంలో సుమారు 80 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. ఇంకొల్లు స్థూ పం సెంటర్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిం చిన పోలీస్ అవుట్ పోస్టును, ఇంకొల్లు బస్టాండ్‌లో తెలుగు దేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలేరు రామకృష్ణ నిర్మించిన మదర్ ఫీడింగ్ రూమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు కనుగుణంగా చంద్రబాబు ఆరు నెలల్లో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేశారన్నారు. ప్రతిక్షణం ప్రజలకు మంచి చేసేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణమే ఏకైక లక్ష్యంతో చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. ఆరు నెలల పాలనలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులను తీసుకొచ్చానని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో మూడు కోట్ల 30 లక్షలతో 175 గోకులాలు నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. రూ.9 కోట్లతో ఆర్ అండ్‌బి రహదారుల మరమ్మత్తులు చేశామని వివరించారు. రూ.50 లక్షలతో కొమ్మమూరు మరమ్మత్తులు సాగునీరు అందించేలా కృషి చేశామన్నారు. ఈ సందర్భంగా ఇంకొల్లు సినిమా హాల్ సెంటర్, స్టాలిన్ పేట కాలనీ, అంకమ్మ కాలనీల వద్ద శిలాఫలకాలు ఆవిష్కరించి సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్ కుమార్, ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్చంద్ర, సర్పంచ్ ప్రసన్న లక్ష్మి, ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్ఐ సురేష్, ఇంకొల్లు మాజీ సర్పంచ్ బోడోల శ్యాంసుందర్, ఇంకొల్లు రోటరీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, కార్యదర్శి అంజిరెడ్డి, రోటరీ సభ్యులు, బాపట్ల జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కరి కమలేశ్వరరావు, బిజెపి, జనసేనస్థానిక నాయకులు, నాయకులు, టిడిపి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

కర్లపాలెం: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. శనివారం పెదగొల్లపాలెం, పేరలి గ్రామాల్లో సిమెంటు రోడ్లను, పశువుల షెడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధి చెందేవిధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ రాజన్న, ఏఈ రమేష్, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, తహశీల్దార్ సుందరమ్మ, సచివాలయ సిబ్బంది, ఎంపీపీ యారం వనజ, నాయకులు బోయిన వెంకటస్వామి, నక్కల వెంకటస్వామి, షేక్ బాజీ, మద్దిబోయిన నాగరాజు, పమిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాపట్ల: నియోజకవర్గంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ సుడిగాలి పర్యటనతో పలుచోట్ల సిసి రోడ్లు, గోకులాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో గ్రామాల్లో రోడ్లపై గుప్పెడు మట్టి కూడా పోయలేదన్నారు. బాపట్ల మండలంలో నర్సాయపాలెం, కంకటపాలెం, స్టువర్టుపురం, వెదుళ్ళపల్లి, పడమర బాపట్ల గ్రామపంచాయతీ పరిధిలోని వైఎస్సార్ నగర్, మద్దిబోయినవారిపాలెం, వల్లువారిపాలెం, వెదుళ్ళపల్లి కొత్త పాలెం గ్రామాల్లో సిసి రోడ్లను నరేంద్ర వర్మ ప్రారంభించారు. ముత్తాయపాలెం గ్రామపంచాయతీ పరిధిలో మినీ గోకులాన్ని ఆయన ప్రారంభించారు. పలు గ్రామాల్లో జరిగిన సిసి రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎంపీడీవో బాబురావు, పంచాయతీ రాజ్ డీఈ రాజన్న, ఏఈ మోహన్ రావు, రాష్ట్ర తెలుగు మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ మానం విజేత, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, కావూరి శ్రీనివాసరెడ్డి, బాపట్ల మండల పార్టీ అధ్యక్షులు ముక్కమల సాంబశివరావు, బాపట్ల మండల ప్రధాన కార్యదర్శి గుడిపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం: రైతులు ఆర్థిక ప్రగతి సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం పల్లె పండుగ కార్యక్రమంలో నిర్మించిన క్యాటిల్ షెడ్లు ప్రారంభించారు. మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం, అక్కాయపాలెం చీరాల మండలంలో పిట్టువారిపాలెం, గావినివారిపాలెం గ్రామాలలో ప్రారంభించారు. వేటపాలెం మండలంలో మొత్తం 51 షెడ్లు శాంక్షన్ కాగా 15 షెడ్లు పూర్తి చేశారు. చీరాల మండలంలో మొత్తం 26 షెడ్లు శాంక్షన్ కాగా 10 షెడ్లు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ సుబ్రమణ్యం, ఏపీవో దాసు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, జయ కుమార్, దేవ బాబు, శాంత ప్రసాద్, నాగ చరణ్, శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పల్లపోలు శ్రీనివాసరావు, బోర్లా శ్రీనివాసరావు, కీర్తి వెంకటేశ్వర్లు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

విజయం సాధించిన చెన్నై జట్లు

ఉత్సాహంగా మేదరమెట్లలో క్రికెట్ పోటీలు

థండర్ బౌల్ట్స్, తిరుపతి జట్ల మధ్య మ్యాచ్

ప్రజాశక్తి-మేదరమెట్ల

రావినూతలలో జరుగుతున్న 31వ సంక్రాంతి క్రికెట్ పోటీలలో భాగంగా శనివారం జరిగిన రెండు మ్యాచ్‌లు ప్రేక్షకులకు అలరించాయి. అతి తక్కువ స్కోర్లు నమోదైన మొదటి మ్యాచ్‌లో ఇండియన్ బ్యాంక్ ఎస్ఎంఆర్ఎల్ థండర్ బౌల్ట్స్, తిరుపతి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన తిరుపతి జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదటిగా బ్యాటింగ్ చేసిన ఇండియన్ బ్యాంక్ చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లను కోల్పోయి 125 పరుగులు చేసింది. జట్టులో మిచెల్ 47 పరుగులు చేశారు. సంజయ్ 43 పరుగులు చేశాడు. అనంతరం 126 విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన తిరుపతి జట్టు 20 ఓవర్లలో 115 పరుగులు మాత్రమే చేసి ఏడు వికెట్లను కోల్పోయి పది పరుగుల అపజయాన్ని మూటగట్టుకుంది. జట్టులో ఎస్‌వి రాహుల్ ఒక్కడే చెప్పుకోదగ్గ స్కోరు 43 పరుగులు 46 బంతులలో చేశాడు. అచీతం నంద మాత్రం బౌలింగ్లో పరవాలేదు అనిపించాడు. 4 ఓవర్లకు 14 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లను సాధించాడు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఎస్సీ రైల్వే హైదరాబాద్, ఎస్‌కే ఎంసిసి చెన్నై జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన హైదరాబాద్ జట్టు బ్యాటింగ్ ఎంచుకొని 15.4 ఓవర్లలో 51 పరుగు మాత్రమే చేసి ఆల్ అవుట్ అయింది. అనంతరం 52 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఎస్కే ఎంసిసి చెన్నై జట్టు కేవలం 4.5 ఓవర్లలోనే 2 వికెట్లను కోల్పోయి 55 పరుగుల చేసింది. దీంతో ఎనిమిది వికెట్ల విజయాన్ని చెన్నై జట్టు సాధించింది. చెన్నై జట్టులో సూర్య, గౌరీ శంకర్, గణేష్ తలో రెండు వికెట్లను తీసి హైదరాబాద్ జట్టు పతనానికి కారుకులై చెన్నై జట్టును గెలిపించారు. దీంతో శనివారం జరిగిన మ్యాచ్‌లో రెండు చెన్నై జట్లే విజయాలు సాధించాయి. ఆదివారం ఉదయం సౌత్ జోన్ సిసి వర్సెస్ లైన్ సిసి బెంగళూర్ జట్ల మధ్య జరగనుండగా, మధ్యాహ్నం జిఎస్‌టిసిసి లెవెన్ చెన్నై వర్సెస్ వైట్ ఫీల్డ్ సిఏ 11 బెంగళూరు జట్ల మధ్య జరగనుంది.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఇంకొల్లు

అపోలో స్పెక్ట్రా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడులోని ఆసరా వృద్ధాశ్రమంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డా.గోపి వర్మ, డా.రంగనాథ్ రెడ్డి, డా.సజ్ఞ పాల్గొని సేవలను అందించారు. నిర్వాహకులు శిబిరానికి విచ్చేసిన పెద్దలకు, రోగులకు, భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భవనం శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ జయలక్ష్మి, ఆశ్రమ సిబ్బంది, వైద్య సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది బాలాజీ, అనిల్ పాల్గొన్నారు.

13న పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అద్దంకి : ప్రముఖ కళాకారుడు, హరిశ్చంద్ర పాత్రధారి బండారు రామారావు జీవిత చరిత్రపై రాసి "ఆణిముత్యాలు బండారు బ్రదర్స్" అనే పుస్తకాన్ని ఈ నెల 13న సోమవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించనున్నట్లు బండారు రామారావు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ బండారు రామారావు తన గాత్రంతో రాష్ట్రవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా కళాకారులకు సన్మాన కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు.

చెక్కులు అందజేత

ప్రజాశక్తి-అద్దంకి

సీఎం సహాయనిధి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. 22 మందికి సంబంధించి రూ.43 లక్షల చెక్కులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పేదలకు అండగా నిలబడుతోందన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోలేదన్నారు. టీడీపీ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

'శ్రీ సరస్వతి'లో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగరంలోని శ్రీ సరస్వతి విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్పీ దామోదర్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12, 13, 14 తేదీలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఛైర్మన్ డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక గద్దలగుంట మహిళా ప్రాంగణంలో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ముగ్గుల, ఆటల పోటీలలో పాల్గొన్న వారికి బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. 14వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సభ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను వివరాలను తెలియజేసి, సమస్యలపై ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇస్తామన్నారు. సంక్రాంతి సంబరాలలో గద్దలగుంటలోని ప్రజలు, ముఖ్యంగా మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాసులు, శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, కమిటీ సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఉమ్మడిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఒంగోలు టూటౌన్ సిఐ మేడా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

సిఐ శ్రీనివాసరావు

కోడిపందేలు, పేకాట, మట్కా.. తదితర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు టూటౌన్ సిఐ మేడా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండుగల నేపథ్యంలో ఎవరైనా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి సంక్రాంతి జరుపుకోవాలన్నారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఉద్యోగాలు పొందే సమయములో, పాస్ పోర్ట్ పొందే సమయాలలో ఈ కేసులు అడ్డంకిగా మారి యువత జీవితాలు అధోగతి పాలవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సంక్రాంతి సెలవులకు విహార యాత్రలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేసేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. బైక్ పై వెళ్తున్న వాళ్ళు హెల్మెట్ తప్పక ధరించాలని, కారులో వెళ్లే వాళ్ళు సీట్ బెల్ట్ ఉపయోగించడం మర్చిపోవద్దని సూచించారు. పండుగ ప్రతి సంవత్సరం వస్తుంది గానీ ప్రాణం పోతే మాత్రం తిరిగి రాదన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడి పందెం, జూదం మరియు ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లుగా తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ – 112/100కు సమాచారాన్ని అందించాలని కోరారు.

కనీస పెన్షన్ రూ.పది వేలివ్వాలి..

ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈపీఎఫ్ చందాదారులకు కనీస పెన్షన్ పదివేల రూపాయలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆల్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శనివారం ఒంగోలులోని పివిఆర్ బాలికోన్నత పాఠశాలలో ప్రకాశం అసోసియేషన్ జిల్లా మహాసభ నిర్వహించారు. జి.శేషయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పెన్షనర్లకు రావలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మహాసభ తీర్మానం చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిక్ పెన్షన్ స్థానే ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలు చేయాలని కోరారు .అదేవిధంగా పెండింగ్ డిఏ లను తక్షణం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది కాలంలో సంఘం నిర్వహించిన కార్యకలాపాలపై సంఘ ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాంబాబు నివేదిక ప్రవేశపెట్టారు.

అసోసియేషన్ సభలో మాట్లాడుతున్న సత్తిరాజు

అనంతరం సభ పలు తీర్మానాలను ఆమోదించింది.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం జిల్లా నూతన శాఖతో పాటు ఒంగోలు ట్రెజరీ శాఖలను ఎన్నుకున్నారు అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జి.శేషయ్య, సిహెచ్. రాంబాబు, కోశాధికారిగా బివి రావు, అసోసియేట్ అధ్యక్షులుగా టీవీఆర్ సుబ్బారావు, గౌరవాధ్యక్షులుగా ఏవి పుల్లారావు, రాబిన్ రవికుమార్, గౌరవ సలహాదారుగా టి.గోపాల్ రెడ్డి, పి పేరయ్య, మహిళా కార్యదర్శులుగా పమిడి మీనా కుమారి, అజయ్ సంపత్ కుమారి ఎన్నికయ్యారు. ఒంగోలు ట్రెజరీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా బడితల మోహన్‌రావు, సింగరాజు శ్రీనివాసరావు తదితరులు ఎన్నికయ్యారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సత్తిరాజు పరిశీలకులుగా పర్యవేక్షించిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటేనపల్లి శ్రీనివాసులు, ఎన్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అయ్యపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు వడ్డే ఓబన్న

సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వడ్డే ఓబన్న ను ప్రతి ఒక్కరు స్మరించు కోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. శనివారం వడ్డే ఓబన్న 218 జయంతి సందర్భంగా కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు శిస్తు వసూలుకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి ఓబన్న పోరాటాలు చేసి ప్రజల కోసం నిలిచారన్నారు. కార్యక్రమంలో బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా, జిల్లా బి సి సంక్షేమ శాఖ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో..

రైతులపై అధిక పన్నులు విధించడం వలన బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల కోసం చేసిన పోరాటంలో వడ్డే ఓబన్న కీలక పాత్ర పోషించారని అడిషనల్ ఎస్పి టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అడిషనల్ ఎస్పి ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌బి ఇన్స్పెక్టర్ నారాయణ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్

జిజిహెచ్ వైద్యులు

ఉదయం 9 నుంచి 4 వరకు విధుల్లోనే..

- ఎటువంటి మినహాయింపూ లేదు..

- అడిషనల్ డిఎంఇ డాక్టర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిజిహెచ్‌లో వైద్యులు ఉదయం 9 గంటల నుంచి 4 వరకు విధుల్లోనే వుండాలని, అందుకు ఎటువంటి మినహాయింపు లేదని అడిషనల్ డిఎంఇ డాక్టర్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. జిజిహెచ్‌లో జిఎన్ఎం పరీక్షల కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిజిహెచ్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీనాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌ను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. పరికరాల కొనుగోలు కోసం ఎన్టీఆర్ వైద్య సేవ నిధులను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన పలు విభాగాలపై సమీక్ష నిర్వహించారు. బ్లడ్ అందరికీ ఉచితంగా అందాలని, ఇందుకోసం స్వచ్ఛంద సంస్థలతో ఎంఓయు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, హెచ్‌ఓడిలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిజిహెచ్ అధికారులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-గిద్దలూరు

మండలంలోని వెల్లుపల్లి, వెంగళరెడ్డిపల్లి గ్రామాలలో కలుపు నివారణ మందు వాడి నష్టపోయిన రైతన్నల పంట పొలాలను ప్రజా సంఘాల నాయకులు ఆవులయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేసిన విజయ ఫర్టిలైజర్ షాపుపై వ్యవసాయాధికారులు చర్యలు తీసుకొని రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారులు స్పందించి రైతులకు జరిగిన పంట నష్టం అంచనా వేసి కలుపు నివారణ మందు కంపెనీపై, దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరగకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పంటలను పరిశీలిస్తున్న నాయకులు

ఎస్‌ఐ విజయ్‌ను సర్వీస్ నుంచి తొలగించాలి

దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న నాగేంద్రరావు

ఏఆర్ ఏఎస్ఐ మేడిద సంపూర్ణరావును కారుతో ఢీకొట్టి చంపిన దొనకొండ ఎస్సై విజయ్ కుమార్‌ను పోలీసు సర్వీసు నుంచి తొలగించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ దళితుల పట్ల పోలీసు వివక్షకు సంపూర్ణ రావు యాక్సిడెంట్ కేసు మరో ఉదాహరణ అన్నారు. రాంగ్ రూట్‌లో కారులో వస్తూ విజయ్‌కుమార్ సంపూర్ణరావు బైక్‌ను ఢీ కొట్టారన్నారు. మరణించిన వ్యక్తి, మరణానికి కారణమైన వ్యక్తి ఇద్దరూ పోలీస్ విభాగానికి చెందిన వారే అయినా పోలీసులు మనిషిని చంపిన ఎస్ఐను కాపాడేందుకు ప్రయత్నించారన్నారు. సంపూర్ణ రావు ఎస్‌సి మాల కులస్తుడు కావటంతో పోలీసులు ఎఫ్ఐఆర్‌లో ఎస్సై విజయ్ కుమార్ పేరు నమోదు చేయలేదన్నారు. దళితుల ఆందోళన చేశాక, తప్పనిసరి పరిస్థితుల్లో శవ పంచానామాలో ఎస్ఐ జయ్ కుమార్ పేరు నిందితుడిగా చేర్చారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి వ్యతిరేక ఎస్ఐ విజయ్ కుమార్ ను పోలీసు ఉన్నతాధికారులు సర్వీస్ నుంచి తొలగించాలని, తక్షణమే అరెస్టు చేయాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, నాయకులు కాకుమాను రవి, కసుకుర్తి రాజు పాల్గొన్నారు.

పరమేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

పరమేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఎపిటిఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పరమేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఒంగోలులో జరిగిన సంస్మరణ సభలో ఎపిటిఎఫ్ కనిగిరి జోన్ నాయకులు సిఎస్. పురం మండల నాయకులు పాల్గొన్నారు. ఆయన చిత్ర పటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పి.రాజకుమార్, షేక్.నాయబ్‌రసూల్, హజరత్‌రెడ్డి, తోట శ్రీనివాసులు, ఎన్.రమేష్, కెవి. సుబ్బయ్య, మచ్చ ప్రసాద్, పి.మాలకొండయ్య, కె.రామ్మో హన్, శ్రీను, జెఎస్.ఆనంద్‌బాబు, ఇండ్ల ప్రసాద్, ఒంగోలు వెంకటేశ్వర్లు, దండే శ్రీనివాసులు, నారాయణ, జి.శ్రీకాంత్, రాములు, జి.ప్రభాకర్ పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

సిఐటియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సిఐటియు ఒంగోలు నగర కమిటీ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ రాంబాబు, టి మహేష్, నగర ఉపాధ్యక్షులు ఎస్ డి హుస్సేన్, కె శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి జె ఉదయ్‌కిరణ్, నాయకులు కె గోపి, ఎం బాబు, కె వంశీ, ఏ రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 సెక్షన్ పరిధిలో ఉదయం 7 గంటల నుండి ఉదయం 10 గంటల వరకు గాంధీనగర్, శివాజీనగర్, హరిహర నగర్, వడ్డివానికుంట, జెడ్ పి కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ముస్లిముల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- తబ్లిక్ ఇస్తిమాలో పాల్గొన్న మంత్రి, ఎంపి మాగుంట, దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టట్

ముస్లిం మైనార్టీలను అన్ని విధాల అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల్లో శనివారం నిర్వహించిన నిజాముద్దీన్ తబ్లిక్ ఇస్తిమాలో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనలు చేశారు. అనంతరం మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలను అన్ని విధాల అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో టిడిపి హయాంలో ఇమామ్‌లు, మౌజన్‌లకు నెల నెలా వేతనాలిచ్చామని, మసీదుల మరమ్మతులకు నిధులు విడుదల చేశామన్నారు. హజ్ యాత్రకు వెళ్ళే వారికి ఆర్థిక సాయం చేశామని, పేదింటి ముస్లిం ఆడబిడ్డ వివాహానికి దుల్హన్ పథకంతో చంద్రబాబు పెద్దన్నలా సాయం చేశారని గుర్తు చేశారు. ఎంఎ షరీఫ్‌కు శాసన మండలి చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించామని అన్నారు. గత 5ఏళ్ల వైసిపి పాలనలో ముస్లిం, మైనారిటీలకు జగన్ ద్రోహం చేశారని ఆరోపించారు. ముస్లింలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారని అన్నారు. దీంతో గత ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలంతా కూటమికి అండగా నిలిచారన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అనంతరం మౌలానా ఫారూఖ్ సాలిక్ సాబ్ దువా చేశారు. కార్యక్రమంలో ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, మైనార్టీ శాఖ సలహాదారు ఎంఎ షరీఫ్, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బిఎన్ విజయకుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ మౌలానా ముస్తాక్ అహ్మద్, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసారి బాలాజీ, జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టిడిపి నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, షేక్ కఫిల్ బాషా, అమరుల్లా, అల్లాభక్షు, మహ్మద్ ఖాన్, పఠాన్ హనీఫ్ ఖాన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇస్తిమాలో పాల్గొన్న మంత్రి, ఎంపి, ఎంఎల్‌ఎ

నిర్మాణ రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- రాష్ట్ర మంత్రి డాక్టర్ డిబివి స్వామి
- వైసీపీ హయాంలో కుదేలైన నిర్మాణ రంగం
- భూ కబ్జాదారుల భరతం పడతాం
- ప్రాపర్టీ షోలో ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

ప్రాపర్టీ షోలో మంత్రి స్వామి ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వైసిపి విధ్వంసకర పాలనతో గత ఐదేళ్ళలో రాష్ట్రంలో నిర్మాణ రంగం కుదేలైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఒంగోలు ఏ1 ఫంక్షన్ హాలులో శనివారం క్రెడయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ, బిల్డింగ్ మెటీరియల్ షోలో ఆయన మాట్లాడారు. ఆయనకు అసోసియేషన్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ప్రధాని మోదీ విశాఖకు వచ్చి రూ.2లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని అన్నారు. నిర్మాణ రంగంపై 34 లక్షల మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఉచిత ఇసుక విధానం తెచ్చి నిర్మాణ రంగానికి ఊతమిచ్చామని అన్నారు. క్రెడాయ్ వంటి సంస్థలు కలిసి ముందుకు రావాలని, రియల్ ఎస్టేట్ రంగంలో సమస్యల పరిష్కారానికి ముందుంటామని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలే భూ సమస్యలకు కారణమని, భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ఆస్తులను రక్షిస్తామని హామీ ఇచ్చారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నగరంలో క్రెడయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా ప్రాపర్టీ, మెటీరియల్ షోను నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. ఇళ్ళను కొనుగోలు చేసేవారు, కట్టుకునే వారికి ఈ షో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఒంగోలు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అత్యాధునిక డిజైన్లు, ఇంటీరియల్ మెటీరియల్‌తో ఇళ్లు కట్టుకునే వారికి ఈ షో దోహపడుతుందని అన్నారు. అనంతరం అతిథులను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్రెడయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నాతాని రఘురామయ్య, అధ్యక్షులు జి రాజేంద్ర, కార్యదర్శి కె ప్రసన్నాంజనేయులు, కోశాధికారి మునగ తిరుమల, ఉపాధ్యక్షులు సిహెచ్ హరిప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ రాఘవరెడ్డి, ఐవి వీరబాబు, శ్రీనివాసరెడ్డి, ఎవిఎన్ బాబు, కె రఘునాథ్, పి నాగేశ్వరరావు, వై ఐజాక్ న్యూటన్, టి వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులు ఓబన్నకు ఘన నివాళి

ప్రజాశక్తి-దర్శి

స్వాతంత్ర్య సమరయోధులు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేనాధిపతి వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ శనివారం ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు నిర్వహిస్తోందన్నారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న అన్నారు. ఆయన చరిత్ర చిరస్మరణీయమన్నారు.

విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

సిఎస్ పురం : స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. 218వ జయంతి సందర్భంగా స్థానిక ఒడియరాజు నగర్‌లో ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఓబన్న విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు డాక్టర్ వెంగయ్య, సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి, బత్తుల వెంకటాద్రి, కె వెంకటకొండయ్య, టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, రామకృష్ణంరాజు, దేవేండ్ల తిరుపతయ్య, బివి రమణయ్య, బండారు వెంకటరమణయ్య, బండారు మల్లికార్జున, బత్తుల శ్రీనివాసులు, ఏడుకొండలు, వడ్డెర నాయకులు పాల్గొన్నారు.

సుబ్బమను పరామర్శించిన కదిరి పార్థసారథి

సుబ్బమ్మకు కదిరి పరామర్శ

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని శీలంవారిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి మునగల నారాయణరెడ్డి మాతృమూర్తి మునగల సుబ్బమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చెయించుకోని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి శనివారం శీలంవారిపల్లిలోని సుబ్బమ్మ నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మునగల నారాయణరెడ్డి, మూరం కాశీరెడ్డి, కెవి నరసయ్య, లక్ష్మమ్మ ప్లస్ కళాశాల చైర్మన్ ఇరగని చలపతిరావు, మునగల వెంకటేశ్వర్లు, షేక్.నాయబ్‌రసూల్, నున్నా నారాయణ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ మల్లారెడ్డి

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

మానవత సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్ర వద్ద గల కాశీనాయన ఆశ్రమంలోని అనాథ వృద్ధులకు దుప్పట్లు శనివారం పంపిణి చేశారు. దాత డాక్టర్ మల్లారెడ్డి హాస్పిటల్ అధినేత మల్లారెడ్డి రూ.15వేల విలువైన 70 దుప్పట్లు డాక్టర్ మల్లారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, మానవత సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివారెడ్డి, సంస్థ డైరెక్టర్స్ రాజకేశవరెడ్డి, చింత తిరుపతిరెడ్డి, జైహింద్‌రెడ్డి, దారం వాసుదేవరెడ్డి, జె సుశీల, కాశీనాయన ఆశ్రమం నిర్వాహకులు దారం వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, గోగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాల డైరీలను తనిఖీ చేసిన దానికి ఎస్‌ఐ, ఎఎస్‌ఐ

డెయిరీల్లో పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని పాలడైరీలను ఎస్‌ఐ మల్లికార్జున, ఎఎస్‌ఐ మోహన్‌రావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గంగవరంలోని తేజ, వల్లభ దోసకాయలపాడులోని తిరుమల, బొద్దికూరపాడులోని రామకృష్ణ డైరీలను తనిఖీ చేశారు. కల్తీ జరుగుతుందనే సమాచారం రావడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కల్తీకి సంబంధించి ఎలాంటి ఆధారాలు దొరకలేదని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కోడి పందేలు ఆడితే చర్యలు

ప్రజాశక్తి-దర్శి

సంక్రాంతి సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి గ్రామాలకు వచ్చి ఎవరైనా కోడి పందాలు, పేకాట వంటివి జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ వై రామారావు తెలిపారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారు స్వస్థలాల్లో ఎలాంటి అసాంఘిక చర్యలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ వెంగయ్య

క్రీడలతో స్నేహభావం

ప్రజాశక్తి-సిఎస్ పురం

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని టిడిపి మండల అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంగయ్య అన్నారు. సంక్రాంతి సందర్భంగా సిఎస్ పురంలో జరుగుతున్న కెఎస్ రాయల్, ఎస్‌వి ప్రసాద్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ శ్రీరామ్ పద్మావతితో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ మూడు జిల్లాల స్థాయిలో నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, సిఎస్ పురం ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు తోట చిన్నరామ కృష్ణంరాజు, బత్తుల వెంకటాద్రి, చావా శేఖర్, తోట వెంకటేశ్వర్లు, జగన్నాథం లక్ష్మి పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్

సుధాకర్‌కు నివాళి

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని తూర్పుగంగవరం సర్పంచ్ చాట్ల నాగమణి భర్త చాట్ల సుధాకర్ రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టిడిపి యువనాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ సుధాకర్ మృత దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని చెప్పారు. పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఎంపిపి తనికొండ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

వెంకటేశ్వర్లుకు సన్మానం

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

టిడిపి మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు (వెంగయ్య) ను నియోజకవర్గంలోని ఆరు మండలాల టిడిపి నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ న్యాయ శాస్త్ర విభాగంలో ఆయన డాక్టరేట్ పొందిన సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ కోసం పనిచేసే నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని పలువుర నాయకులు అన్నారు. కార్యక్రమంలో కనిగిరి రూరల్, కనిగిరి టౌన్, పామూరు, హనుమంతునిపాడు, వెలిగండ్ల, పిసిపల్లి మండలాల టిడిపి అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, పువ్వాడి వెంకటేశ్వర్లు, సానికొమ్ము తిరుపతిరెడ్డి, దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి, వేమూరి రామయ్య, టిడిపి నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు, ఎన్‌సి మాలకొండయ్య, బత్తుల వెంకటాద్రి, కోనంకి వెంకట కొండయ్య, బండారు మల్లికార్జున, షేక్ ఫిరోజ్, అడుసుమల్లి ప్రభాకర్, గుంటుపల్లి శ్రీనివాసులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొని సన్మానించారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పరుచూరు: ఐసిడిఎస్ పర్చూరు ప్రాజెక్టు పరిధిలోని అన్నంబొట్లవారిపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు సంక్రాంతి సంబరాల వేడుకలు జరిగాయి. చిన్నారులకు భోగి పళ్ళు, భోగిమంటలు, కోలాటం, ముగ్గులు పలు రకాల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపివో జి.సుభద్ర, సూపర్ వైజర్ ఎమ్.అన్నపూర్ణ, కార్యకర్తలు జి.పుష్పలత, కె.రమాదేవి, ఆయాలు, తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో..

ప్రజాశక్తి-యద్దనపూడి: మండలంలోని అనంతవరంలో శనివారం చిన్నారులకు గాలి పటాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 42 మంది చిన్నారులు పాల్గొన్నారు. 12వ తేదీన విజేతలను ప్రకటించి బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిని కొల్లా వెంకటరమణ, రెండవ బహుమతిని దోప్పలపూడి వేణుబాబు, మూడవ బహుమతిని తూర్పు బజార్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోరిటాల రామకృష్ణ, గుత్తా వాసుబాబు, బోపూడి శ్రీనివాసు, కొత్తపల్లి రాఘవయ్య పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే చర్యలు

బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

మాట్లాడుతున్న డీఎస్పీరామాంజనేయులు

ప్రజాశక్తి-బాపట్ల

సంక్రాంతి పండగను పురస్కరించుకొని కోడి పందేలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు హెచ్చరించారు. శనివారం బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామాంజనేయులు మాట్లాడారు. సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా కుటుంబ సభ్యులతో పండగ జరుపుకోవాలన్నారు. పండగ సందర్భంగా ఎడ్ల ప్రదర్శన పందాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయన్నారు. ఇప్పటికే రెండు పోలీసు బృందాలు జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ వ్యాప్తంగా తిరుగుతున్నాయన్నారు. పండగకు వేరే ఊళ్ళకు వెళ్లేవారు గృహాల్లో విలువైన వస్తువులను ఉంచకోకుండా బ్యాంకు లాకర్లలో జాగ్రత్త చేసుకోవాలన్నారు. ముందస్తుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తెల్లవారుజామున ప్రయాణాలు చేసే వాహన దారులు ఆ సమయంలో ప్రయాణాలను రద్దు చేసుకొని మంచు పూర్తిగా తొలగిన తర్వాత ప్రయాణం చేయాలన్నారు. ఈ సమావేశంలో బాపట్ల సర్కిల్ సీఐ హరికృష్ణ, రూరల్ సీఐ శ్రీనివాసరావు, పట్టణ సీఐ రాంబాబు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-వేటపాలెం

దళిత, బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సంచార జాతులకు మహిళలకు సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని అక్కయ్యపాలెం పంచాయతీ జంగిలి కోటేశ్వరరావు కాలనీలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిబిఆర్సి ఏరియా కోఆర్డినేటర్ వి.భగవాన్ దాస్ మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్‌కు, సంచార జాతులకు ప్రభుత్వ పరంగా అన్ని సంక్షేమ కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలన్నారు. బిడ్డలను చదివించుకోవడం ద్వారా వారికి ఉన్నత భవిష్యత్తును ఇవ్వాలని సూచించారు. మెప్మాలో పొదుపు సంఘాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. అంబేద్కర్ వాది ఆదిలక్ష్మి మాట్లాడుతూ సంచార జాతులు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని తెలియజేశారు. పని ప్రదేశంలో హింసకు గురవుతున్నారని, వీరిపై వేధింపులు జరుగుతున్నాయని తెలియజేశారు. నేటికీ వీరికి నివాసయోగ్యమైన ఇల్లు లేవన్నారు. స్నానానికి పబ్లిక్ టాయిలెట్స్ వాడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వీరిని పారిశుధ్య కార్మికులుగా గుర్తించి వారికి అన్ని వసతులు కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీల ప్రసాద్, సుందరమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

ప్రజాశక్తి-వేటపాలెం

కేక్ తినిపిస్తున్న ఏఎస్ఐ శామ్యూల్

తెల్ల దొరలతో వీరోచితంగా పోరాడి నేలకొరిగిన యోధుడు వడ్డే ఓబన్న అని ఏఎస్ఐ సాల్మన్ అన్నారు. శనివారం స్థానిక జింఖానా క్లబ్‌లో మండల వడ్డే సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుంచాల సింగయ్య అధ్యక్షత వహించారు. ఎఎస్ఐ శామ్యూల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నమ్మినబంటని తెలిపారు. ఓబన్న స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా తమ బిడ్డలను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యతోనే ఆర్థిక సామాజిక అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుకోవచ్చని తెలిపారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. చివరగా ఏఎస్ఐ శ్యామేల్ మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వడ్డే సంఘం నాయకులు మల్లెల రవి, చల్ల గంగరాజు, మల్లెల శ్రీనివాసరావు, పల్లపు శ్రీను, గుంజ మారుతి, పల్లపు సురేష్, మల్లెల కృపారావు, కుంచాల వీర్లంకయ్య పాల్గొన్నారు.

సేవలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్ చౌదరి అన్నారు. పర్చూరు క్లబ్‌ను శనివారం ఆయన సందర్శించారు. క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గత ఆరు నెలల్లో పర్చూర్ క్లబ్ చేపట్టిన 37 సేవా కార్యక్రమాలను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. పర్చూరు వాగుపై చెక్‌డ్యాం నిర్మించాలని గవర్నర్‌ని సభ్యులు అడిగారు. ముందుగా నాగులపాలెం ఆర్‌సిసి వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ రమేష్ చంద్ర, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు నాగభైరవ శ్రీనివాసరావు, నాగుబడి సుబ్బారావు, కెఆర్‌కె ప్రసాద్, కొల్లా నరేంద్ర కుమార్, గడ్డిపాటి శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్, పాబోలు వెంకన్న, కోట హరిప్రసాద్, కోటా శ్రీనివాసరావు, కాసా అశోక్ కుమార్, కోడూరు సుబ్రహ్మణ్యచారి, కాల్వ సత్యనారాయణ, గ్రామస్తులు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన

ప్రజాశక్తి-బాపట్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 14న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు భీమవారిపాలెం ఎడ్ల బల ప్రదర్శన పోటీ నిర్వాహకులు శనివారం తెలిపారు. పట్టణంలో మచ్చావారిపాలెం రోడ్డులో నిర్వహించే పోటీల కరపత్రాలను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఎడ్ల బలప్రదర్శన పోటీలో పాల్గొనే ఎడ్ల జతల యజమానులు సోమవారం 13న తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. పోటీల్లో మొదటి, ద్వితీయ విజేతలుగా నిలిచిన ఎడ్ల జతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు లేళ్ల నరేంద్ర, రౌతు రాము, ఆళ్ల ఆంజనేయులు, కారుమూరి ఆంజనేయస్, రౌతు శ్రీను పాల్గొన్నారు.

అన్నంబొట్లవారిపాలెంలో..

ప్రజాశక్తి-పర్చూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13వ తేదీ నుంచి అన్నంబొట్లవారిపాలెంలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. కీ.శే గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ప్రాంగణంలో నిర్వహించే 37వ జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఈనెల 17వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 13వ తేదీన పెద్ద సైజు విభాగంలో, 14వ తేదీన జూనియర్స్ విభాగంలో, 15వ తేదీన సబ్ జూనియర్స్ విభాగంలో, 16వ తేదీన సేద్యపు విభాగంలో, 17వ తేదీన పాలపళ్ల విభాగంతో పాటు ఆవుల అందాల పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి విభాగంలో 7 బహుమతులు ఉంటాయని తెలిపారు. 13న జరిగే పెద్ద సైజు విభాగం పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.1,50,116/-, రెండవ బహుమతి, రూ.1,00,116/, మూడవ బహుమతి రూ.60,116/-, నాల్గవ బహుమతి రూ.36,116/-, ఐదవ బహుమతి రూ.20,116/-, ఆరవ బహుమతి రూ.15,116/-, ఏడవ బహుమతి రూ.10,116/- గా నిర్ణయించినట్లు ఆయన వివరించారు. పశుపోషకులు, రైతులు ఈ పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నూతన పాలకవర్గాన్ని ఎన్నుకోవాలి

ప్రజాశక్తి-వేటపాలెం

మాట్లాడుతున్న సుధాకరరావు

వేటపాలెం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన పాలకవర్గాన్ని ఎన్నుకోవడం ద్వారా సత్వర పనులు జరుగుతాయని అసిస్టెంటు రిజిస్ట్రారు, సొసైటీ పర్సన్ ఇన్చార్జి ఎల్.సుధాకరరావు అన్నారు. శనివారం స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల ఆవరణలో ది వేటపాలెం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభ నిర్వహించారు. ఈ సభలో అసిస్టెంటు రిజిస్ట్రారు, సొసైటీ పర్సన్ ఇన్చార్జి ఎల్.సుధాకరరావు సొసైటీపై జరిగిన 51వ విచారణ నివేదిక, జిల్లా సహకార అధికారి గుర్తించిన, దుర్వినియోగమైన సంఘం నిధులు మొత్తం మాజీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యుల నుంచి వసూలు చేసే విషయమై జరుగుతున్న సర్ఛార్జీ విచారణ, మధ్యవర్తిత్వంపై చర్చించారు. పాలకవర్గ ఎన్నికలు నిర్వహించుకోవడం ద్వారా పనులు వేగవంతంగా జరుగుతాయని దుర్వినియోగం అయిన నిధుల గురించి ఉన్నతాధికారుల దగ్గర గట్టిగా మాట్లాడొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ ఆఫీసర్ రమణయ్య బాధితులు సుధాకర్ రెడ్డి, జె.రమేష్, కె.శివరామకృష్ణ, పిచ్చుక సునీల్, నాయని సత్యనారాయణ తదితరులు దుర్వినియోగం అయిన నిధులను సత్వరమే ఇప్పించే విధంగా కృషి చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

స్టేట్ హైవేలను నేషనల్ హైవేలుగా మార్చాలి

కేంద్రమంత్రికి ఎమ్మెల్యే ఏలూరి లేఖ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు నియోజకవర్గంలోని పలు కీలక స్టేట్ హైవేలను నేషనల్ హైవేలుగా మార్చాలని ఎమ్మెల్యే ఏలూరి రాసిన లేఖకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ఎమ్మెల్యే ఏలూరి రాసిన లేఖకు ఆయన సమాధానం పంపారు. తక్షణ మే స్టేట్ హైవేలను నేషనల్ హైవేలుగా మార్చేందుకు సాధ్య సాధ్యాలను పరిశీలిస్తామని ఇందుకోసం ఒక ప్రత్యేక అధికారిని పంపిస్తామని లేఖలో పేర్కొన్నారు. లేఖలో ప్రస్తావించిన ప్రధాన రహదారులను నిబంధనల ప్రకారం అప్‌గ్రేడ్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతిపాదనలు కోరుతామన్నారు. సకాలంలో స్పందిస్తూ చర్యలు చేపడుతున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే ప్రతిపాదించిన హైవేల వివరాలు..

గుంటూరు-నాగులప్పలపాడు (వయా ప్రత్తిపాడు, పెద్ద నందిపాడు, పర్చూరు, ఇంకొల్లు) 83.120 కిలోమీటర్లు, అద్దంకి-మోటుపల్లి (వయా రేణింగవరం, అలవాలపాడు, చందలూరు, కొణికి, ఇంకొల్లు) 40.90 కిలోమీటర్లు, బాపట్ల-మార్టూరు (వయా నర్సాయపాలెం, కంకటపాలెం, చెరుకూరు, వీరన్నపాలెం, కొమరినేనివారిపాలెం, ఉప్పుటూరు, పర్చూరు, యద్దనపూడి) మీదుగా దేగరమూడి ఎన్‌హెచ్ 16 వరకు 53 కిలోమీటర్లు రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని ఎమ్మెల్యే ఏలూరి కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ, కటారివారి పాలెంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 20 కోడి కత్తులు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహారావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీరాల

శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె నరసింహారావు 92వ జన్మదిన వేడుకలు శని వారం స్థానిక వెంకటేశ్వర భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గుర్రంటి చంద్రమౌళి, కౌన్సిల్ మించాల సాంబశివరావు, పిడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ గడ్డం శ్రీనివాసరావు, న్యాయవాదులు సంఘం మాజీ అధ్యక్షులు అక్కిశెట్టి పుల్లయ్య, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు సిహెచ్ మస్తాన్ రావు, మాజీ ఆర్ బి కె చైర్మన్ కాపూరి రమణారెడ్డి, జర్నలిస్టుల సంఘం నాయకులు కాకి ఇజ్రాయిల్, కాకి ప్రభాకర్ రావు తదితరులు అందె నరసింహారావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్లవరపు శ్రీనివాసరావు, కె.కమలాకర్, హోటల్ నరసయ్య, నాగరాజు, దాసు, సుబ్బారావు, మల్లెల రూబేను, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు వైసీపీ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంతమాగులూరు మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడిగా కుందుర్రు గ్రామానికి చెందిన ఊట్ల నాగేశ్వరరావును నియమిస్తున్నట్లు అధిష్టానం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మండలంలో వైసీపీ ఆవిర్భావం నుంచి నిరంతరం కృషి చేసిన నాగేశ్వరరావు నియామకం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో రానున్న కాలంలో వైసీపీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

విద్యుత్ బిల్లులు

భోగి మంటల్లో వేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

మాట్లాడుతున్న గంగయ్య

ప్రజాశక్తి-చీరాల

పెంచిన విద్యుత్తు ఛార్జీలకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 13న భోగి మంటలలో విద్యుత్తు బిల్లులను దగ్ధం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య పిలుపునిచ్చారు. శనివారం పేరాలలోని స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాఉ. కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై స్మార్ట్ మీటర్ మరియు ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ బారాలను మోపుతూ అనేక ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అదానీతో టిడిపి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించాలన్నారు. టిడిపి అధికారం చేపట్టాక రెండుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. అదేమంటే ఇదంతా గత ప్రభుత్వం పాపమంటూ.. ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ విధానాన్ని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబూరావు పాల్గొన్నారు.

గోకులాలతో

పాడి పరిశ్రమకు మరింత ప్రోత్సాహం

- బాపట్ల జిల్లాలోనే రూ.14.76 కోట్లతో 683 గోకులాల నిర్మాణం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

గోకులాల నిర్మాణాలతో పాడి పరిశ్రమకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని, రైతులకు ఆర్థిక చేయూత లభిస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా, అద్దంకి నియోజకవర్గ పరిధిలోని గోవాడ గ్రామంలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి.. నిర్మాణం పూర్తి చేసుకున్న పలు గోకులాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన తరువాత పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే 12,500 గోకులాలను నిర్మించినట్లు మంత్రి వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో కేవలం 260 గోకులాలను మాత్రమే నిర్మించిందన్నారు. నిధులు దుర్వినియోగం తప్ప పాడి పరిశ్రమ అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు.

స్థానిక సమస్యల పరిష్కారం...

బాపట్ల జిల్లాలో శనివారం గోకులాలు ప్రారంభోత్సవంతో పాటు సీసీ రోడ్లు, డ్రైన్లు వంటి పలు అభివృద్ధి పనులు ప్రారంభించి... మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని స్థానికులు కలిసి పలు అభ్యర్థనలు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి ఆ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పోరాట యోధుడు 'వడ్డే ఓబన్న'

- రాష్ట్ర మంత్రి డాక్టర్ డిబివి స్వామి
- ఘనంగా నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వడ్డే ఓబన్న గొప్ప పోరాటయోధుడని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధులు, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఓబన్న జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడంతో శనివారం ప్రకాశం భవనంలో జరిగిన జయంతి కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రాష్ట్ర టూరిజం బోర్డు ఛైర్మన్ నూకసాని బాలాజీ, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి వీరు నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి డిఆర్‌ఓ బి.చినఓబులేసు అధ్యక్షత వహించారు. జయంతి కార్యక్రమంలో మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ బ్రిటిష్ పాలనతో గ్రామ రక్షకుల జీతాలు రద్దు చేయబడిన తరువాత రైతులపై అధిక పన్నులు విధించడం ప్రారంభం కావడంతో ఆ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం మొదలైందన్నారు. సుమారు 9 వేల మంది స్థానికులతో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టారని, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేతత్వంలో సాగిన ఈ ఉద్యమంలో ఓబన్న కీలక పాత్ర పోషించారన్నారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పోరాట ప్రతిభకు ప్రతిరూపంగా ఓబన్న నిలిచారని కొనియాడారు. అనంతరం రాష్ట్ర పర్యాటక బోర్డు ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడారు. వడ్డెర సంఘం నాయకులు వల్లెపు రాఘవులు, కుంచాల వెంకటేశ్వర్లు, తన్నీరు ఆంజనేయులు, శివప్రసాద్ మాట్లాడుతూ అధికారికంగా ఒంగోలులో ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మంత్రితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.

● సంక్రాంతి 'చిత్రం'

కొత్తపట్నం మండలం, అల్లూరులో సంక్రాంతి సంబరాలకు గ్రామస్తులు సిద్ధమయ్యారు. తెలుగు సంప్రదాయాలను ప్రతిబింబించే కోడి పందేలను యువకులు, చిన్నారులు సరదాలు నిర్వహించుకుంటూ..పండుగ వాతావరణం తెచ్చారు.

- ప్రజాశకి, ఒంగోలు ఫొటోగ్రాఫర్

బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఐక్యతకు ఆటలు బాటలు వేయాలి: ఐద్వా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సంక్రాంతి సందర్భంగా వాడవాడల్లో జరుగుతున్న ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతకు దారి చూపాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి చెప్పారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించారు. డివైఎఫ్ఐ నగర సహాయ కార్యదర్శి కె.వంశీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్, ఐద్వా నాయకులు కె.విజయలక్ష్మి, పి.రమణ పాల్గొన్నారు.

13న పోలీస్ గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భోగి పండుగ సందర్భంగా ఈనెల 13న సెలవు దినం కావటంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టం" కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఫిర్యాదులు చేసేందుకు వ్యయప్రయాసలు పడి ఈ నెల 13న జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని ఆయన సూచించారు.

విద్యుత్ తీగలకు దూరంగా గాలిపటాలు ఎగురవేయాలి

ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గాలి పటాలను, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఎగురవేయాలని ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. గాలిపటాలు తీగలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు చిక్కుకున్నప్పుడు ఎవరూ వాటిని తీసే ప్రయత్నం చేయవద్దని అలా చేస్తే విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అటువంటి సందర్భంలో విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

సంక్రాంతి శోభ ఏదీ.?

సంక్రాంతి పండుగ అంటే ధాన్యం రాసులు.. పాడిపంటలు.. ఎక్కడో ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లిన వారంతా సొంతూళ్లకు రావడం.. ఆటలపోటీలు.. సంబరాలు.. ముగ్గుల పోటీలతో ఊళ్లన్నీ కళకళలాడటం. ఇదొకప్పటి చరిత్ర. ఇప్పుడు రానురానూ సంక్రాంతి కాంతి తగ్గుతోంది.పండుగ వాతావరణం తగ్గుతోంది. అందుకు జీవన పరిస్థితులు.. మారుతున్న కాలమానాలు కారణాలుగా కనిపిస్తున్నాయి. చేసే ఉద్యోగంలో క్షణం తీరిక లేకపోవడంతో సాఫ్ట్‌వేర్ కొలువుల్లో ఉన్న వాళ్లు ఎంతమంది సొంతూళ్లకు వస్తున్నారన్నదీ స్పష్టత లేదు. అందరూ బిజీగా కాలం గడుపుతున్నారు. సంబరాలు తగ్గాయి. ఆనందంగా గడిపే రోజులూ తగ్గిపోయాయి. ఏదో ఒకరోజు హడావుడిగా వచ్చివెళ్లడం తప్ప ఏమీ పలకరింపులు కూడా కరువవుతున్నాయి. ఇక ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలూ పోతున్నాయి. ఈ ఏడాది అంటే రబీలో మూడు సార్లు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలకు భారీ వర్షాలు కురిశాయి. పంటలు మూడు సార్లు దెబ్బతినిపోయాయి. రైతులు నష్టపోయారు. పంటచేతికి పూర్తిగా రాలేదు. ప్రభుత్వం నుంచి ఇప్పుడు ఖాతాల్లో పడే పథకాలూ లేకుండా పోయాయి. చేతిలో చిల్లిగవ్వ లేదనే చర్చ సాగుతోంది. కొత్త దుస్తులు కొంటున్నారా? లేదా? అన్నదీ సంశయనంగా మారింది. మాల్స్ వచ్చి రకరకాల ఆఫర్లు పెట్టినా కొనే వాళ్ల సంఖ్య చాలా తక్కువగానే ఉంది. మధ్యతరగతి వర్గాల్లో కొంత పండుగ వాతావరణం కనిపిస్తోంది. వ్యాపారాల్లోనూ నిస్తేజమే కనిపిస్తోంది. మరో వైపు ప్రభుత్వ ఆర్థిక సంక్లిష్టత జనంపైనా పడింది. అన్నింటికీ మూలమైన ఆర్థికం కష్టతరంగా మారింది. కొనుగోలు శక్తి పెరగడం లేదు. నిర్మాణరంగం, రియల్‌ఎస్టేట్ వ్యాపారాలూ నిస్తేజంగా ఉన్నాయి. చలామణి తగ్గింది. ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువతకు ఉద్యోగాలు కనిపించడం లేదు. మరో వైపు చదువుల కోసం పెట్టే వ్యయాలు తగ్గడం లేదు. మరో వైపు రోజురోజుకూ పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో పాలకుల వైఫల్యం కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సంక్రాంతి ఏ మేరకు జీవితాల్లో వెలుగు నింపుతుందనేదీ చూడాలి.

జిల్లాలో భూ సమస్యలు తీవ్రంగా ముందుకు వచ్చాయి. రెవెన్యూ సదస్సుల్లో 16,800 వరకూ అర్జీలు అందాయి. వాటిలో 3,200 మాత్రమే పరిష్కారం చేయగలిగారు. మిగతా వాటిని అలాగే ఉంచారు. ఎప్పటిలోగా పరిష్కారం చేస్తారన్నదే ప్రశ్న. ఏళ్ల తరబడి భూ సమస్యలు కొనసాగుతున్నాయి. వీటిని పరిష్కారం చేయడంలో రెవెన్యూ యంత్రాంగం వైఫల్యం కొనసాగుతోంది. రెవెన్యూ మంత్రి కూడా జాయింట్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలూ పలువురు పాల్గొని భూ సమస్యలపై విన్నవించారు. పలు రకాలుగా భూ సమస్యలు పేరుకుపోయాయి. క్షేత్రస్థాయిలో వీటిని పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కారం చేయడం లేదు. ప్రభుత్వాలు మారినపుడల్లా కొత్త చట్టాలు.. కొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారు. సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే చేశారు. వాటి వల్ల కూడా చాలా సమస్యలు అర్జీల రూపంలో వచ్చాయి. రీసర్వేలో తప్పిదాలపైనే 9,400 అర్జీలు అందాయి. హద్దుల సమస్యలు మొదలు వెబ్‌ల్యాండ్ వరకూ వివిధ అంశాల్లో భూ వివాదాలున్నాయి. రైతులకు పాసుపుస్తకం ఇవ్వాలంటే లక్షల్లో లంచాలు అడుగుతున్నారు. రెవెన్యూ శాఖ పనితీరు ఇలా ఉంది. కనిగిరిలో తహశీల్దార్ సహా పలువురు సిబ్బందిని కలెక్టర్ సస్పెన్షన్ చేయడం రెవెన్యూశాఖ పనితీరుకు అద్దం పడుతోంది.

జిల్లా అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్‌లో కలెక్టర్ అన్సారియా పలు రంగాల్లో చేపట్టాల్సిన అంశాలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు ఏర్పాటుతోనే అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో డాక్యుమెంట్ రూపొందించారు. అయితే అందుకు నిధులు కీలకం. వెలిగొండ పూర్తిచేయడం ద్వారా సాగునీరు, తాగునీరు అందించాలన్నది లక్ష్యం. ఇది పూర్తి కావాలంటే భారీగా నిధుల అవసరం ఉంది. రెండేళ్లలో గడువు పెట్టారు. ఏటా రూ.2 వేల కోట్లు నిధులు కావాలి. అయితే మొన్న బడ్జెట్‌లో రూ.398 కోట్లు చూపారు. ఇలాగే నిధులు కేటాయిస్తే విజన్‌లు అమలవుతాయా? అన్నది ఆలోచించాలి. జిల్లాల పునర్విభజన ప్రశ్నార్థకంగా మారింది. కాలం గడిచిపోతోంది. ఎన్నికల ఏడాది కూడా పోయింది. కొత్త ఏడాది వచ్చింది. కొత్త వ్యూహాలు..కొత్త ఆలోచనలో అడుగులు వేస్తే తప్ప జిల్లా సమగ్రాభివృద్ధి సాకారం కాదనేది గుర్తించాలి.